క్లుప్తంగా

వైభవంగా సాగుతున్న బ్రహ్మోత్సవాలు



చిట్టేల(వత్సవాయి) : గ్రామంలో వేంచేసి యున్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగోరోజు మంగళవారం పుణ్యాహవాచన, అగ్నిస్థాపన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. వేదపడింతులు మంత్రోచ్చారణల నడుమ సోమవారం రాత్రి స్వామివారి కల్యాణాన్ని ఆలయ ధర్మకర్త మార్నెళ్ల పుల్లారెడ్డి దంపతులు పీటలపై కూర్చుని అత్యంత వైభవంగా జరిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. భక్తులకు అన్నదానం చేశారు. అర్చకులు హరి శివరామప్రసాద్‌శాస్త్రి, సిరికొండ సాయికృష్ణ మాచార్యులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టు పరిశీలన



గండ్రాయి(జగ్గయ్యపేట): ఎన్నికల నేపథ్యంలో జగ్గయ్యపేట మండలం గండ్రాయి వద్దనున్న అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టును విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గ వ్యయ పరిశీలకుడు వి.జస్టిన్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు. అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా జగ్గయ్యపేట పట్టణంలోని నియోజకవర్గ ఎన్నికల అధికారి కార్యాలయాన్ని మైలవరం, నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గ వ్యయ పరిశీలకుడు మదన్‌కుమార్ సందర్శించారు. రికార్డులను పరిశీలించారు.

300 మద్యం సీసాలు స్వాధీనం



పోలంపల్లి(వత్సవాయి) : మండలంలోని పోలంపల్లి పంట పొలాల్లో బస్తాల్లో దాచి ఉంచిన 300 మద్యం సీసాలను ఎక్సైజ్ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. పొలాల్లో మద్యం సీసాలను నిల్వ చేశారనే సమాచారం తెలుసుకున్న ఎస్ఈబీ సీఐ మణికంఠ, తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి 300 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దర్యాప్తులో భాగంగా మద్యం దాచిన వారి వివరాలను కనిపెట్టి వారిపై తగిన చర్యలు తీసుకుంటామని సీఐ వివరించారు.

నేలరాలిన మామిడి



పెనుగంచిప్రోలు: ఎండ తీవ్రతతో అల్లాడుతున్న ప్రజలు మంగళవారం మధ్యాహ్నం నుంచి మారిన వాతావరణంతో కొంత ఉపశమనం పొందారు. భారీగా వీచిన ఈదురుగాలుల ఉధృతికి మామిడితోటల్లో కాయలు నేలరాలాయి. పలుచోట్ల కొమ్మలు విరిగిపడిపోయాయి. ఏటా మామిడి కాయలు కోతల సమయంలో ఇలా ఈదురు గాలులకు నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పంట దిగుబడి అంతంతమాత్రంగానే ఉన్న సమయంలో ఈదురుగాలులకు కాయలు రాలిపోయి నష్టం వాటిల్లిందని తెలిపారు. అదేవిధంగా పెనుగంచిప్రోలు తుఫాన్ కాలనీలో చెట్టు కొమ్మలు విరిగి పడటంతో విద్యుత్‌వైర్లు తెగిపోయి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

ఓటేసిన హోం ఓటర్లు



నందిగామ: నందిగామ నియోజకవర్గంలో హోం ఓటింగ్ కోసం 109మంది దరఖాస్తు చేసుకోగా, వీరిలో మంగళవారం 80మంది వృద్ధులు, దివ్యాంగులు వారి ఓటుహక్కును వినియోగించుకున్నారు. నందిగామ పట్టణంలో 17మంది, మండలంలో 16మంది, కంచికచర్ల మండలంలో 19మంది, చందర్లపాడులో 17మంది, వీరులపాడులో 11మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నట్లు ఆర్వో ఎ.రవీంద్రరావు తెలిపారు. హోం ఓటింగ్ ప్రక్రియను ఆర్వో పరిశీలించారు.

విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



విభరింతలపాడులో ప్రజలకు అబివాదం చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

చందర్లపాడు(నందిగామ టౌన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యతనిచ్చి పేదలకు అండగా నిలిచారని నందిగామ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. చందర్లపాడు మండలంలోని విభరింతలపాడు, పోపూరు, వెలదికొత్తపాలెం, ఏటూరు, ముప్పాళ్ల గ్రామాల్లో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికలలో అండగా నిలిచి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా గ్రామానికి వచ్చిన జగన్‌మోహనరావుకు ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ గత ప్రభుత్వాలకు సాధ్యంకాని రీతిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన సాగించారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సచివాలయ భవనాలు, రైతుభరోసా కేంద్రాలు, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, జగనన్న పాల వెల్లువ తదితర అభివృద్ధి పనులతో గ్రామీణ ప్రాంతాలు నూతన శోభను సంతరించుకున్నాయన్నారు. విభరింతలపాడులో రూ. 5.61కోట్లతో అభివృద్ధి



వెలదికొత్తపాలెంలో ప్రచారంలో యువత కేరింతలు

పనులు చేపట్టగా రూ.30.04కోట్లమేర సంక్షేమ పథకాలు అందించామన్నారు. వెలదికొత్తపాలెం సచివాలయం పరిధిలోని పోపూరు. పున్నవల్లి గ్రామాల్లో రూ.11.23 కోట్లతో అభివృద్ధి పనులు చేయగా రూ.33.25 కోట్లను సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందించినట్లు తెలిపారు. ముప్పాళ్లలో రూ.9.62 కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. రూ.44.21 కోట్లను డీబీటీ, నాన్ డీబీటీ పథకాల ద్వారా గ్రామస్తులకు అందించినట్లు చెప్పారు. రానున్న ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా తనను, విజయవాడ ఎంపీగా కేశినేని శ్రీనివాస్(నాని)ని గెలిపించాలని ఓటర్లను కోరారు. ప్రచారంలో ఎంపీపీ గుడేటి నాగమల్లేశ్వరీ, జెడ్పీటీసీ సభ్యుడు ముక్కపాటి నరసింహారావు, వైస్ ఎంపీపీ నల్లాని రమాదేవి, మండల కన్వీనర్ కందుల నాగేశ్వరరావు, నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, చింతోటి ప్రసాద్, వేణు, దశరదరామ్, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకోవాలి

విప్ ఉదయభాను



జగ్గయ్యపేటలో ప్రచారం నిర్వహిస్తున్న విప్ సామినేని ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్రం బాగుండాలంటే ప్రజలకు జనరంజకమైన పాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్నే మళ్లీ గెలిపించుకోవాలని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట ఎమ్మెల్యే అభ్యర్థి సామినేని ఉదయభాను పిలుపునిచ్చారు. జగ్గయ్యపేటలోని మార్కండేయ బజారు, బంగారుపేట, చెరువుబజారు తదితర ప్రాంతాల్లో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమంతోపాటు జగ్గయ్యపేట నియోజకవర్గ అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ ఈనెల 13న జరిగే ఎన్నికల పోలింగ్‌లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని ప్రజలను కోరారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో గతంలో, ఈ ఐదేళ్లలో జరిగిన అభివృద్ధిని బేరీజు వేసుకుని ఓటర్లు నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ అమలుచేసి ప్రతి ఒక్కరి హృదయాల్లో సుస్థిర స్థానం ఏర్పరచుకున్నారని తెలిపారు. ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి విజయవాడ ఎంపీగా కేశినేని శ్రీనివాస్ (నాని), జగ్గయ్యపేట ఎమ్మెల్యేగా తనను



లక్ష్మీనారాయణ దంపతులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఉదయభాను

భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ప్రచారంలో వైఎస్సార్ సీపీ పట్టణ మహిళా అధ్యక్షురాలు మునిని రాజ్యలక్ష్మి, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఎండీ జాన్‌బాషా, పట్టణ సచివాలయాల కన్వీనర్ తుమ్మేపల్లి నరేంద్ర, మార్కెట్ యార్డు డైరెక్టర్ గోలి రామేశ్వరి, స్థానిక నాయకులు మునిని శివ, సంగిశెట్టి శ్రీరంగమ్మ, చావా పిచ్చయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి చేరికలు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని రంగస్వామి బజారు నుంచి రాష్ట్ర పద్మశాలీ సంఘం ప్రధానకార్యదర్శి భారత లక్ష్మీనారాయణ దంపతులు టీడీపీని వీడి మంగళవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే ఉదయభాను కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అదేవిధంగా పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడు గ్రామానికి చెందిన కోటా తిరుపతిరావు, దాసరి వినోద్, వత్సవాయి మండలం మంగొల్లు గ్రామానికి చెందిన సింగాల వీరబాబు పార్టీలో చేరారు. ఉదయభాను వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా స్వాగతం పలికారు. వైఎస్సార్ సీపీ పెనుగంచిప్రోలు మండల అధ్యక్షుడు కనకపూడి భాస్కరరావు, ఊట్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నందిగామలో భారీవర్షం



నందిగామ ఆర్డీవో ఆఫీసు రోడ్డులో పారుతున్న వర్షపు నీరు



జాతీయ రహదారిపై పారుతున్న వర్షపు నీరు

- మూడు సెంటీమీటర్ల వర్షపాతం..
- హైవేపై అడుగుమేర పారిన వర్షపునీరు
- తీవ్ర ఎండల నేపథ్యంలో ఊరటచెందిన ప్రజలు
- మామిడి రైతులకు కొద్దిమేర నష్టం

నందిగామ: నందిగామ ప్రాంతంలో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన అకాల భారీ వర్షం కురిసింది. సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. గంట పాటు ఈదురుగాలులతో కూడిన భారీవర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. జాతీయ రహదారిపై వర్షపు నీరు ఏరులై పారింది. పట్టణంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో జాతీయ రహదారిపై దాదాపు అడుగుమేర నీరు నిలిచిపోయింది. ఈదురుగాలుల బీభత్సానికి మామిడి తోటల్లో కాయలు నేలరాలాయి. గతేడాది డిసెంబర్ 6వతేదీన నందిగామలో 11 సెంటీమీటర్ల మేర భారీ వర్షం కురవగా, మంగళవారం మూడు సెంటీమీటర్ల మేర వర్షం కురిసింది. ఈ అకాల వర్షం మామిడితోటలకు కొంతమేర నష్టం చేసింది. ఎండలు మండుతుండటంతో కొద్దిరోజులుగా భానుడి ప్రతాపానికి విలవిలలాడిన ప్రజలు ఈ భారీ వర్షంతో ఊరట చెందారు.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: మండలంలో మంగళవారం ఓ మోస్తరు వర్షం కురవటంతో ప్రజలు సేద తీరారు. మధ్యాహ్నం వరకు భానుడు విజృంభించినప్పటికీ సాయంత్రం సమయంలో ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. భానుడి ప్రతానికి అల్లాడుతున్న ప్రజలకు మంగళవారం కురిసిన వర్షంతో వాతావరణం చల్లడటం ప్రజలకు కొంతమేర ఉపశమనం కలిగించిందని చెప్పవచ్చు.

కంచికచర్లలో..

కంచికచర్ల : కొద్దిరోజులుగా ఎండ వేడిమి ఉక్కపోతతో అల్లాడిన కంచికచర్ల ప్రజలు మంగళవారం ఉరుములుతో కూడిన వర్షం పడటంతో కొద్దిసేపు సేదతీరారు. మంగళవారం సాయంత్రం ఆకాశంలో మబ్బులు కమ్మి ఈదురుగాలులతోపాటు ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడటంతో ప్రజలు సేదతీరారు.

భక్తులందరికీ కుంకుమ ప్రసాదం పంపిణీ చేపట్టాలి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులందరికీ కుంకుమ ప్రసాదం అందేలా చూడాలని ఈవో కె.ఎస్.రామరావు ఆలయ అధికారులకు సూచించారు. మహా మండపం ఆరో అంతస్తులో జరుగుతున్న కుంకుమ ప్యాకెట్ల తయారీని ఈవో మంగళవారం పరిశీలించారు. ప్యాకింగ్ విధానంతోపాటు కుంకుమ నాణ్యతను పరిశీలించారు. సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసే భక్తులు తొలుత అమ్మవారి దర్శనం ప్రశాంతంగా జరగాలని చూస్తారని, ఆ తర్వాత అమ్మవారి కుంకుమ ప్రసాదం దొరికితే మహా ప్రసాదంగా భావిస్తారన్నారు. ముఖ్యంగా శుక్ర, శని, ఆదివారాలలో భక్తులందరికీ కుంకుమ ప్రసాదం అందేలా అవసరమైన ప్యాకెట్లను సిద్ధం చేసి ఆలయంలో అందుబాటులో ఉంచాలన్నారు. రోజుకు ఎన్ని ప్యాకెట్లు సిద్ధం చేస్తున్నారు.. ఎంత మంది సేవలకు తమ సేవలను అందిస్తున్నారనే వివరాలను ఏఈవో ఎన్.రమేష్‌బాబు ఈవోకు వివరించారు.

జగన్‌మోహనరావు విజయం కోరుతూ ప్రచారం



జుజ్జూరులో ప్రచారం చేస్తున్న షహనాజ్‌బేగం, నాయకులు



కంచికచర్లలో ప్రచారం చేస్తున్న నాయకులు

జుజ్జూరు(వీరులపాడు): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రంలో సామాజిక న్యాయం సాకారమవుతుందని షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మంగళవారం ఆమె జుజ్జూరులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ చేసిన అభివృద్ధిపై కరపత్రాలను పంపిణీ చేశారు. నందిగామ ఎమ్మెల్యేగా డాక్టర్ జగన్‌మోహనరావు, ఎంపీగా కేశినేని నానిలను గెలిపించాలని ఓటర్లను కోరారు.ఈసందర్భంగా షహనాజ్‌బేగం మాట్లాడుతూ ప్రజలకు అత్యుత్తమ పాలన అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నందిగామ అభివృద్ధికి ఎమ్మెల్యే జగన్‌మోహనరావు చేసిన కృషిని గమనించి ఆయన్ను మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో పీఏసీఎస్ చైర్మన్ పూలా రాంబాబు, సర్పంచి రమావత్ కోటి, వైస్ ఎంపీపీ నాగుల్‌మీరా, నాయకులు షేక్ మోమిన్, షేక్ ఖాజాపీర్, నరసింహారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంచికచర్లలో...

కంచికచర్ల : నందిగామ ఎమ్మెల్యేగా డాక్టర్ జగన్ మోహనరావు, విజయవాడ ఎంపీగా కేశినేని శ్రీనివాస్(నాని)ల విజయాన్ని కోరుతూ వైఎస్సార్‌సీపీ మండల నాయకులు మంగళవారం కంచికచర్లలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ఫ్యాన్ గుర్తుపై ఓటేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు. కంచికచర్లతోపాటు మండలంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ మండల, పట్టణ అధ్యక్షులు నన్నపనేని నరసింహరావు, వేమా సురేష్‌బాబు, ఎంపీటీసీ సభ్యుడు మాడుగుల మధు, ఏఎంసీ వైస్ చైర్మన్ మాడుగుల శంకర్, గోగినేని వెంకటేశ్వరరావు, నాయకులు వేమా శివకోటి, దేవరకొండ గురవయ్య, బుద్ది హనుమంతురావు, చిన్నంశెట్టి ప్రసాద్, నారిశెట్టి శ్రీను, గుగులోతు శివనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉదయభాను గెలుపు కోరుతూ ప్రచారం



మిట్టగూడెంలో ప్రచారం చేస్తున్న మైనార్టీ నాయకుడు సత్తార్, నాయకులు



పేటలో ప్రచారం చేస్తున్న ఉదయభాను సోదరి బేబి, కోడలు కావ్య, మేనల్లుడు ప్రతీక్, నాయకులు



మాగల్లులో ప్రచారం చేస్తున్న కొమ్మినేని రవిశంకర్, నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే సామినేని ఉదయభానుకు గెలిపించాలని కోరుతూ స్థానిక 3, 6వవార్డుల్లో ఉదయభాను సోదరీమణి చాముండేశ్వరి(బేబి), మేనల్లుడు ప్రతీక్(బిన్ను), కోడలు కావ్య మంగళవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు ఎమ్మెల్యేగా ఉదయభాను, ఎంపీగా కేశినేని శ్రీనివాస్(నాని)ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్లు కొలగాని రాము, కాశి అనురాధ, మాజీ కౌన్సిలర్ కొలగాని వెంకయ్య స్థానిక నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా 58వ పోలింగ్ కేంద్రం పరిధిలోని మిట్టగూడెంలో వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం నియోజకవర్గ నాయకుడు షేక్ సత్తార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉదయభానును గెలిపించాలని కోరుతూ ఓటర్లను అభ్యర్థించారు. ముస్లిం నాయకులు, పార్టీ బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట మండలంలో..

జగ్గయ్యపేట:వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సామినేని ఉదయభాను, విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని నానిలను గెలిపించాలని ఆపార్టీ నాయకులు మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పోచంపల్లిలో సర్పంచి బూతుకూరి లక్ష్మీనాగిరెడ్డి, కె.అగ్రహారంలో ఆవల శ్రీనివాసరావు, అనుమంచిపల్లిలో పానుగంటి త్రివేణినాయుడు, వేదాద్రిలో గుడారు పేరయ్య తదితర నాయకులు ఆయా గ్రామాల్లో ఇంటింటా ప్రచారం చేశారు. ఫ్యాన్ గుర్తుపై ఓటెయ్యాలని ఓటర్లను కోరారు.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి : ప్రజలకు మంచిచేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని తిరిగి ఎన్నుకుంటేనే అందరికీ మేలు జరుగుతుందని జెడ్పీటీసీ యేశపోగు దేవమణిశ్రీనివాస్, ఎంపీపీ కొలుసు రమాదేవి పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట ఎమ్మెల్యే అభ్యర్థి సామినేని ఉదయభాను, విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని)ల విజయాన్ని కాంక్షిస్తూ వత్సవాయి ఎస్సీ కాలనీలో మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు.సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటికీ మేలు చేకూరిందన్నారు. సంక్షేమపథకాలు సజావుగా అమలుకావాలంటే సీఎం జగనన్న ప్రభుత్వమే మళ్లీ రావాల్సి ఉందన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు. ప్రచారంలో సర్పంచి భూక్యా సీతమ్మ, జిల్లా పార్టీ కార్యదర్శి గాదెల రామారావు, వైస్ ఎంపీపీ కొలికిపోగు వెంకటేశ్వర్లు, సొసైటీ అధ్యక్షులు రంగిశెట్టి ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

వెంకటాపురం(పెనుగంచిప్రోలు): సంక్షేమ పథకాల ద్వారా పేదల అభ్యున్నతికి కృషిచేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అందరూ అండగా ఉండాలని ఎంపీపీ మార్కపూడి గాంధీ కోరారు. మండలంలోని వెంకటాపురంలో మంగళవారం వైఎస్సార్ సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. విజయవాడ ఎంపీగా కేశినేని నాని, జగ్గయ్యపేట ఎమ్మెల్యేగా సామినేని ఉదయభానును గెలిపించాలని ఓటర్లను కోరారు. ఎంపీపీ గాంధీ మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి నిరాటంకంగా కొనసాగాలంటే జగనన్నను మరోమారు రాష్ట్రానికి ముఖ్యమంత్రి చేసుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. ప్రచారంలో సర్పంచి కూచి నర్సయ్య, ఎత్తిపోతల పథకం చైర్మన్ పొన్నం వెంకటేశ్వరరావు, నాయకులు వెంకటయ్య, మాదల ఉగ్ర నరసింహారావు, జక్కులూరి దేవదాసు పాల్గొన్నారు. మండల కేంద్రం పెనుగంచిప్రోలు మోడల్ కాలనీలో సర్పంచి వేల్పుల పద్మకుమారి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కాకాని పద్మ, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ముండ్లపాడులో జరిగిన ప్రచారంలో వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, సొసైటీ అధ్యక్షులు గూడపాటి రవికుమార్, నాయకులు చెన్నకేశవులు, తదితరులు పాల్గొన్నారు.

మాగల్లులో..

నందిగామ: రాష్ట్రంలో మరోమారు ఫ్యాను ప్రభంజనం కొనసాగాలని కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్ అన్నారు. మండలంలోని మాగల్లులో మంగళవారం సాయంత్రం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి జగ్గయ్యపేట ఎమ్మెల్యేగా సామినేని ఉదయభాను, విజయవాడ ఎంపీగా కేశినేని శ్రీనివాస్(నాని)ను గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ప్రతిఒక్కరూ వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని ఓటర్లను అభ్యర్థించారు. ఎన్నికల ప్రచారంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వత్సవాయిలో ప్రచారం నిర్వహిస్తున్న జెడ్పీటీసీ దేవమణి, నాయకులు



వెంకటాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ గాంధీ, సర్పంచి నర్సయ్య, నాయకులు



పోచంపల్లిలో ప్రచారం చేస్తున్న సర్పంచి లక్ష్మీనాగిరెడ్డి, నాయకులు

పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్న ఉద్యోగులు





నందిగామలో ఓటు వేస్తున్న ఉద్యోగులు

నందిగామ: సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వహించనున్న ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సదుపాయాన్ని ఉద్యోగులు వినియోగించుకుంటున్నారు. పట్టణంలోని కెవిఆర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ద్వారా మంగళవారం 125 మంది ఉద్యోగులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులంతా పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలని రిటర్నింగ్ అధికారి ఎ.రవీంద్రరావు కోరారు.

జగ్గయ్యపేటలో ఓటేసిన ఉద్యోగులు..

జగ్గయ్యపేట: సార్వత్రిక ఎన్నికలలో భాగంగా పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్‌కేంద్రంలో నాలుగోరోజు మంగళవారం 100మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ బుధవారం కూడా కొనసాగుతుందని, ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులంతా ఓటుహక్కును వినియోగించుకోవాలని రిటర్నింగ్ అధికారి జి.వెంకటేశ్వర్లు సూచించారు.